నేటి దినపత్రిక
సూర్య
అమరావతి
ఆదివారం
11 ఫిబ్రవరి
2024
పేజీలు 8
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్

## గుంటూరులో డయేరియా

# కలకలం..






- కలుషిత నీరు తాగి ఒకరి మృతి
- మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- పదిమందికి తీవ్ర అస్వస్థత
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు
- బాధితులకు జనసేన అండ : ఎంపీ బాలశౌరి

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : గుంటూరు నగరంలో డయేరియా విజృంభించింది. శారదా కాలనీలో మున్సిపల్ నీళ్లు తాగి శనివారం పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిలో 2లో

## చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉంది

### ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ కుమార్



మచిలీపట్నం, మేజర్‌న్యూస్ : మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 7 మంది చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ కుమార్ వెల్లడించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై వివిధ ప్రసార మాధ్యమాలలో పలు రకాలుగా కథనాలు వస్తున్న నేపథ్యంలో సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంటనే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 9 మంది చిన్నారులు జలుబు, దగ్గులు ఉండి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి శుక్రవారం చికిత్స కోసం రాగా రాత్రి 8 గంటల సమయంలో వారికి అమాక్సిన్ పొటాషియం క్లావులనేట్ మిగతా 2లో...

ఎన్నికల నిర్వహణకు

## పటిష్ట ఏర్పాట్లు

### మార్గదర్శకాలకు అనుగుణంగా సన్నద్ధత కార్యకలాపాలు

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు



ఎన్‌టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 10, మేజర్‌న్యూస్ : త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీ రావు తెలిపారు. 2

## రానున్న ఎన్నికలకు పటిష్టవంతమైన ఏర్పాట్లు



వివరాలు 2లో



## అతివేగం ప్రమాదకరం

### మట్టి ట్రాక్టర్లకు ఎస్సై మాస్ వార్నింగ్

### 'మొదలైన మట్టి దందా' కథనానికి స్పందించిన ఎస్సై నాగరాజు

కృత్తివెన్ను, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ : అతివేగం, అధికలోడుతో ప్రయాణిస్తే ప్రమాదకరమని ఎస్సై కె.నాగరాజు హెచ్చరించారు. శనివారం సూర్యా పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన

వివరాలు 2లో...

సూర్య ఎఫెక్ట్

# గుంటూరులో డయేరియా కలకలం









(మొదటిపేజీ తరువాయి)

పద్మ అనే మహిళ మృతి చెందగా, మరో 10మంది అస్వస్థతకు గురై జీజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. బాధితులను కమిషనర్ చేకూరి కీర్తి, జనసేన, తెదేపా నాయకులు పరామర్శించారు. మూడు రోజుల క్రితం డయేరియాతో సంగడిగుంటకు చెందిన కొర్రపాటి ఓబులు మృతి చెందారు. గత కొన్ని రోజులుగా మున్సిపాలిటీ నుంచి కలుషిత నీరు సరఫరా అవుతోందని నగర వాసులు ఆరోపిస్తున్నారు. పద్మ కుటుంబానికి న్యాయం చేయాలంటూ తెదేపా, జనసేన నాయకులు జీజీహెచ్ వద్ద ఆందోళనకు దిగారు. ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని తరలించవద్దంటూ నిరసన చేపట్టారు. తాగునీరు సరిగా ఇవ్వలేని కమిషనర్ ఎందుకని ప్రశ్నించారు.

**రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలి**

గుంటూరులోనీ సంగడిగుంట, శ్రీనగర్ వివిధ ప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీరు త్రాగడం వల్ల 30 మంది అనారోగ్య బారిన పడి, ఒకరు మృతి చెంది ఉన్నారు. చనిపోయిన కుటుంబానికి 50లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి న్యాయం చేయాలని తెదేపా పశ్చిమ నియోజకవర్గం ఇన్చార్జి కోవెలమూడి రవీంద్ర శనివారం డిమాండ్ చేశారు, గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు..అనతరం జిజిహెచ్ సూపరిండేంట్‌ను బాధితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగయిన వైద్యం అందించాలని కోరారు

**బాధితులను పరామర్శించిన తెదేపా తూర్పు ఇంచార్జ్ నసీర్**

గుంటూరు నగరంలో కలుషిత నీటిని త్రాగి గడిచిన రెండు రోజుల్లో ఓబుల్ అనే వ్యక్తి మృతి చెందగా శనివారం ఒక మహిళ మృతి చెందటం దురదృష్టకరమని గుంటూరు తూర్పు నియోజకవర్గం తెదేపా ఇన్చార్జి నసీర్ అన్నారు. చికిత్స పొందుతున్న బాధితులను శనివారం గుంటూరు గవర్నమెంట్ వైద్యశాలలో ఆయన పరామర్శించారు. నగరంలో, అనేకమంది కలుషిత నీరు త్రాగి వివిధ ప్రైవేట్ హాస్పిటల్లోనూ, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు వీరిలో కొంతమంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ నసీర్ బాధితులను, ,మృతదేహాన్ని సందర్శించి పరామర్శించారు. ఈ సంఘటనపై నసీర్ నగరపాల సంస్థ కమిషనర్‌ని వివరణ కోరగా వారు సమాధానం దాటవేశారు. ఘటనపై నసీర్ ర్ స్పందిస్తూ నగరంలో గత కొంతకాలం నుంచి కలుషిత నీరు సరఫరా జరుగుతోందని చెప్పారు.మూడు రోజుల క్రితమే ఈ విషయాన్ని తాను అధికారుల దృష్టికి తెచ్చానా పట్టించుకోలేదని విమర్శించారు, బాధ్యతగల కమిషనర్ కూడా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు,ఇది పూర్తిగా ప్రభుత్వ హత్యేనని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమని ఘటనపై పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే నని తక్షణమే ప్రభుత్వం బాధితులను ఆదుకొని వారికి నష్టపరిహారం అందజేయాలని నజీర్ డిమాండ్ చేశారు

**బాధిత కుటుంబాలకు జనసేన అండగా ఉంటుంది**

**జనసేన నేత ఎంపీ బాలశౌరి**

గుంటూరు నగరంలో కలుషిత నీరుతాగి ఆసుపత్రి పాలైన బాధితులకు మెరుగైన వైద్యం అందజేయాలి – ఎంపీ వల్లభనేని బాలశౌరి శనివారం డి మాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మున్సిపాలిటీ నుంచి కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పద్మా అనే మహిళ మృతి చెందిందన్నారు. మృతులు, బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని ఎంపీ బాలశౌరిలిచెప్పారు. నగరంలోని పలు కాలనీల్లో మున్సిపాలిటీ నుంచి వస్తున్న నీరు కలుషితం కావడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన తనను కలిచివేసిందని జనసేన నాయకులు, ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఎంపీ బాలశౌరి మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ సూచించారు. ఈ మేరకు శనివారం ఎంపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేసింది.. గుంటూరు నగరంలోని శారదాకాలనీ, శ్రీనగర్, సంగడిగుంట, తదితర కాలనీల్లో మున్సిపాలిటీ కలుషితమైన నీరు తాగడంతో దాదాపు 30 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరందరూ ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. అయితే.. శనివారం నాడు పద్మ(18) అనే మహిళ మృతి చెందడంపై ఎంపీ బాలశౌరి స్పందించారు. గత వారం రోజులుగా కలుషిత నీరు వస్తున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం వహించడం దారుణమని ఎంపీ బాలశౌరి తెలిపారు. కనీసం ప్రజలకు అవగాహన కల్పించకుండా కలుషిత నీరు విడుదల చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులకు ఎంపీ బాలశౌరి సూచించారు. మృతి చెందిన బాధిత మహిళ కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని అన్నారు. బాధితులకు అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందజేయాలన్నారు. జనసేన పార్టీ తరపున బాధితులను ఆదుకుంటామని ఎంపీ బాలశౌరి తెలిపారు.

(మొదటిపేజీ తరువాయి)

## చిన్నారుల ఆరోగ్యం నిలకడగా ఉంది

ఇంజక్షన్ ను వైద్యులు వేయడం జరిగిందన్నారు. ఆ ఇంజక్షన్ సరైన మందు అని, కాల పరిమితి లోనిదేనని చెప్పారు. అందులో 7 మంది చిన్నారులు అయాన్షి, యోషిత, నాగమణికంఠ, మహమ్మద్ రేహాన్, గాయత్రీ, వర్షిత, పార్థులకు రాత్రి 9 గంటల సమయంలో కొంత జ్వరం రావడంతో వెంటనే స్పందించి 7 మంది వైద్యులను పిలిపించి ఆ 7 మంది చిన్నారులకు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుని వైద్యం అందించడం జరిగిందన్నారు. దీంతో ఆ చిన్నారులు రాత్రి 11:30 గంటలకు పూర్తిగా కోలుకున్నారన్నారు. చిన్నారుల ఆరోగ్యం గురించి ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

# అతివేగం ప్రమాదకరం

ఎస్సై నాగరాజు మట్టి తోలకాలు జరుపుతున్న ట్రాక్టర్లను నిలిపివేసి వారిని హెచ్చరించారు. మట్టి తోలకాల జరుపుతున్న సమయంలో వేగ నియంత్రణ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగిన మట్టి తోలకాలు జరుపుతున్న వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, ట్రాక్టర్లను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మట్టి తరలించేవారిదేనన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎన్నికల సన్నద్ధత కార్యకలాపాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్‌డీవో బీహెచ్ భవానీ శంకర్ తదితరులతో కలిసి హాజరయ్యారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సీఈవో మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ డిల్లీరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. తుది ఓటర్ల జాబితా అనంతరం వివిధ ఫారాల పరిష్కారం, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు, భద్రతా సిబ్బందికి శిక్షణ, నియోజకవర్గాల వారీగా రూట్లు, అవసరమైన వాహనాలు తదితర అంశాలపై ఏర్పాట్లను తెలియజేశారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్ ప్రణాళిక, సాంకేతిక వినియోగ ప్రణాళికల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డిల్లీరావు వెల్లడించారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎస్పీ



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మోపిదేవిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ హస్మి. ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకొనగా, ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ హస్మికి ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలను అందించారు.

## ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా జరిగే విధంగా పోలీసు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆద్నాన్ నయీమ్ హస్మి అన్నారు. శనివారం సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల ను ఆయన పరిశీలించి డి ఎస్పీ మురళీధర్, అవనిగడ్డ సిఐ త్రినాధ్‌కు పలు సూచనలు చేశారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి రికార్డులను తనికీ చేసి సంతృప్తి వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎస్ఐ రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికలకు పటిష్టవంతమైన ఏర్పాట్లు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సన్నద్ధతకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన అన్ని చర్యలు పటిష్ట ప్రణాళికతో తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లు, ఓటరు క్లైయిమ్ పరిష్కారం అంశాలపై జిల్లా కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలకసంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితాకు సంబంధించి అన్నిరకాల క్లైయిమ్ లు నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రింటింగ్ అయ్యి వచ్చిన ఎపిక్ కార్డులను పోస్టల్ డిపార్టుమ్మెంట్ ద్వారా ఎప్పటికప్పుడు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాల పనులు కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నాయని, సోమవారం నాటికి వాటిని పూర్తి చేయటం జరుగుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ సన్నద్ధత ఏర్పాట్లుకు సంబంధించి పోలింగ్ పర్సనల్స్ కు ఈఈఎం, ఇతర బృందాలు ఏర్పాటకు సంబంధించి అవసరమైన అధికారులు, ఉద్యోగులు వివరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు.



జిల్లాలోని అన్నినియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు రవాణా, యాక్సిస్ బులిటీ ప్లాన్, రూట్ మ్యాప్ రూపొందించటం జరిగిందని, అవసరమైన వాహనాల సిద్ధం చేయటం జరుగుతుందన్నారు. భద్రత ఏర్పాట్లుకు సంబంధించి జిల్లా ఎస్పీ ని సమన్వయం చేసుకొని అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో సమస్యాత్మక, క్రిటికల్ పోలింగ్ బూత్ లను గుర్తించటం జరిగిందని, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫికీ, కమ్యూనికేషన్, టెక్నాలజీ యూజ్ ప్లాన్ కు ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా కు వివరించారు. ఈ సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.రవీంద్ర రావు, లక్ష్మీ కుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే.లక్ష్మీ శివజ్యోతి, ఆర్డీఓ పి. శ్రీఖర్, డీఆర్డీఏ పీడీ వై.హరిహరనాథ్,, డీఈఓ శైలజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహాశక్తితో మహిళా శక్తిగా తీర్చిదిద్దేది టీడీపీనే..



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటి కార్యక్రమంలో భాగంగా టీడీపీ,జనసేన పార్టీల ఆధ్వర్యంలో మిని మానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆదివారం 6 వ వార్డులోని ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ నియోజకవర్గ పరిశీలకులు పంతాని మురళీధర్‌లు తెలుగుదేశం పార్టీ ఇచ్చిన మిని మానిఫెస్టో హామీలలో భాగంగా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది చిన్నారులు చదువుతుంటే వారి అందరికి ఒకొక్కరికి సంవత్సరానికి 15 వేల రూపాయలు, ఆడబిడ్డ నిధి నుండి 18 సంవత్సరాలు నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం పేరుతో ప్రతి ఇంటికి సంవత్సరానికి ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్లు, యువగళం పేరుతో యువతకు 20 లక్షల మందికి ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి నుండి నిరుద్యోగభృతి నెలకు 3 వేల రూపాయలు, అన్నదాతకు ప్రతి సంవత్సరం ఒక్కొ రైతుకు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం, ఇంటింటికి మంచినీటి పథకం క్రింద ప్రతి ఇంటికి రక్షిత త్రాగునీరు, కులాయి కనెక్షన్, పేదలను సంపన్నులను చేసే దిశగా వారి ఆదాయం 5 సంవత్సరాల్లో కనీసం రెట్టింపు చేయడం బిసిలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాల అండగా ఉండేలా రూపోందించడం మిని మానిఫెస్టో పథకాలను వివరించారు.

ఈ కార్యక్ర మంలో జిల్లా ఎస్సి సెల్ నాయకులు, ఎం ఆదినారాయణరావు, టీడీపీ సీనియ ర్ నాయకులు మండలి రాంమోహన్‌రావు, బడే సుబ్బారావు, బచ్చు రఘునాథ్, మైలా హరిబాబు, అడపా శ్రీనివాసరావు, యలవర్తి ఆది, కౌతవరపు వెంకటేశ్వరరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## భవిత పిల్లలకు సేవ చేయటంలో ఎంతో ఆనందం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** భవిత పిల్లలకు సేవ చేయటంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని జి కొండూరు మండల విద్యాశాఖ అధికారి 2 ఎం వీర స్వామి అన్నారు డెమోక్రటిక్ పి ఆర్ టి యు మాతృ సంస్థ అయిన పిఆర్టియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జి కొండూరు ప్రాథమిక పాఠశాలలోని భవిత పిల్లలకు పండ్లు బ్రెడ్లు అందజేశారు. సేవాదళ్ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అన్నారు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జివి రామకృష్ణ మాట్లాడుతూ భవిత పిల్లలకు ఇటువంటి కార్యక్రమాలు చేయడం వలన వారు ఎంతో సంతోషంగా ఉంటారని మనకు కూడా ఎంతో ఆనందంగా ఉంటుందని ఇటువంటి కార్యక్రమాలు డెమోక్రటిక్ పిఆర్టియు వారు నిర్వహించడం సంతోషించదగ్గ విషయం అని వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డెమోక్రటిక్ పిఆర్టియు రాష్ట్ర కార్యదర్శి పెదగమళ్ల నాగరాజు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అక్బర్ పాష ఉమ్మడి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అచ్చన శ్రీనివాసరావు, మండల జిల్లా నాయకులు వి నరసింహారావు పి నాగరాజు పి సురేష్ పి సురేంద్రబాబు మహిళా నాయకులు ఎన్ వరలక్ష్మి ఏ సత్యవాణి భవిత టీచర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా అమ్మకు వందనం



**నందిగామ, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్:** స్థానిక రైతు పేటలో గల శ్రీ చైతన్య పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య ఘనంగా అమ్మకు వందనం వేడుక నిర్వహించారు.స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా మానవతా విలువలు అంతరించిపోతున్న ఈ రోజులలో అమ్మ నాన్న ఒక గొప్పతనాన్ని విద్యార్థుల చేతనే తల్లిదండ్రులకు గుర్తుండిపోయే విధంగా జరిగిన ఈ కార్యక్రమం ఎందరినో అలరించింది. విద్యార్థినీ విద్యార్థుల ప్రేమ వారి తల్లిదండ్రుల మీద ఎంత అమోఘంగా ఉంటుంది అని ఈ కార్యక్రమం నిరూపించిందని పాఠశాల ప్రిన్సిపల్ గుత్తా ప్రదీప్ విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు.తల్లిదండ్రులు వారి మనసులోని కోరికలను విద్యార్థిని విద్యార్థులు ఎలా ఉండాలి అనేటటువంటి ఒక మంచి సందేశాన్ని స్టేజి మీద నుండి వారి పిల్లలను ఉద్దేశించి తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులు కోసం వారు స్వయంగా తయారు చేసినటువంటి కానుకలను వారి తల్లిదండ్రులకు ఇవ్వటం జరిగింది ఇటువంటి కార్యక్రమాలు పాఠశాల ఆవరణలో పెట్టటం చాలా ముఖ్యమని ఎందరో తల్లిదండ్రులు వారి యొక్క సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజీ మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ చైతన్య స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ



**కృత్తివెన్ను ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :** చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఒడుగు తులసిరావు పేర్కొన్నారు. శనివారం కృత్తివెన్ను గుడిదిబ్బ పల్లిపాలెం గ్రామాలలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళుతూ తెలుగుదేశం పార్టీ పెడన ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ ని ఆదరించి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను పంచాయతీ సర్పంచ్ తిరుమాని రామ తులసి, తెలుగుదేశం నాయకులు చేకూరి వెంకట్రావు, కూనసాని చిన్న, పాశం నాగమల్లేశ్వరరావు, తిరుమని ఏసుబాబు, నడకుదిటి ఆంజనేయులు, దాసరి బాల యేసు, వాటాల ఏడు కొండలు, జెల్ల వెంకటేష్, యాదిరెడ్డి కొండయ్య, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, రేవు యేసు బాబు, తమ్ము ఏసు, మైల రాంబాబు, టి రామస్వామి, బి వెంకన్న, సుబ్బారావు, సత్యనారాయణ, ఈగలపాటి భాస్కరరావు, సిహెచ్ రాఘవేంద్ర, తోట రాధాకృష్ణ, దండిపోలు వెంకటేశ్వరరావు, వాటాల నాగమనేశ్వరరావు, ధర్మరాజు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కాగిత ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ



**పెడన, మేజర్ న్యూస్ :** మండల పరిధి కమలాపురం గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మేనిఫెస్టోను ఇంటింటికి వివరించామని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఒక అవినీతి ప్రభుత్వం పరిపాలిస్తున్నదని, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజా పాలన చేయకుండా రాక్షస పాలన చేస్తున్నారని కాగిత దుయ్యబట్టారు... ఈ భవిష్యత్తు గ్యారెంటీ భాగంలో ఇచ్చిన గ్యారెంటీలను తప్పక అమలుపరుస్తారని రేపు 2024 లో జనసేన, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుందని తప్పక హామీలు నెరవేరుస్తారని కాగిత చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, కమలాపురం జనసేన టీడీపీ నాయకులు నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడు కొండల, మండల పార్టీ అధ్యక్షుడు సలపాటి వీర ప్రసాద్, జెడ్పిటిసి అర్జా వెంకట నగేష్ ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాద్, జనసేన నాయకులు పంద్రాజు లక్షణ కమలాపురం గ్రామ నాయకులు కొట్టే సుబ్రమణ్యం ఎర్ర అంజయ్య మండలంలోని వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు గోపాలకృష్ణ,లంకల కలవగుంట వాసు, అంకెం పైడేశ్వరరావు, కవి పురం సర్పంచ్ పుప్పాల నాని, వేణు, శ్రీనివాసరావు వీర వెంకటేశ్వరరావు, సతీష్, పనికుమార్ కాకర్లమూడి సర్పంచ్ కామేశ్వరరావు, వెంకటరత్నం, రాము, వాసు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురక వ్యాధి వైద్య విధానంపై జాతీయ స్థాయి సదస్సు



ప్రముఖ వైద్యులు డా.విద్యా సాగర్.

**విజయవాడ, ఫిబ్రవరి10 మేజర్ న్యూస్ :** నిద్రించే సమయంలో చాలామందికి గురక వల్ల వచ్చే సమస్యలు అనుభవమే. ఈ వ్యాధికి ఇప్పటివరకు పూర్తిస్థాయి చికిత్సలు అందుబాటులోకి రాలేదు. ఈ వ్యాధి నివారణపై నిరంతరం జరుగుతున్న పరిశోధనలు, వైద్య విధానాలు, అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలు ప్రజలకు తెలియజేసేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఫర్ స్లీప్ ఆప్నియా (ఐ.ఎ.ఎస్.ఎస్. ఎ) ప్రతి ఏటా దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో సదస్సులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జాతీయ సదస్సు కు విజయవాడ నగరం వేదిక కానుంది. ఐ ఎ యస్ యస్ సదస్సు మన నగరంలో జరగనుందని ప్రముఖ వైద్యులు విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యారావుపేట కోవెలమూడి వారి వీధిలోని సాగర్ ఈ ఎన్ టి ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభం కానుందని వివరించారు.గురక వ్యాధి చికిత్సలో అనేక పరిశోధనలు చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ మోహన్ కామేశ్వరన్, డాక్టర్ దీన్ దయాల్ సహా దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధి పొందిన వంద మందికి పైగా వైద్యులు నిపుణులు ఈ సదస్సులో వ్యాధి నివారణ కోసం చేసిన పరిశోధన అంశాలను ఈ సదస్సులో వివరిస్తారని పేర్కొన్నారు. వైద్య రంగ ప్రముఖులు వైద్యులు సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని డా. విద్యా సాగర్ కోరారు.

## అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్ ప్రారంభం



**విజయవాడ మేజర్ న్యూస్ :** అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ ప్రోగ్రామ్ కింద, లీడర్‌షిప్ ఫర్ ఈక్విటీ, క్వెస్ట్ అలయన్స్, ఏపీ ప్రభుత్వం మధ్య ఒక ఎంఓయు జరిగినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. పాఠశాల విద్యా కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డితో సహా కీలక ప్రభుత్వ అధికారులు సమక్షంలో ఈ ఎంఓయుపై సంతకాలు జరిగాయి. ఈ ఎంఓయు రాష్ట్రంలో ప్రారంభమైన కార్యక్రమాన్ని సూచిస్తుంది. తొలుత శ్రీకాకుళం, విజయనగరం, వైజాగ్ జిల్లాల్లో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం 2024-25 విద్యా సంవత్సరం నాటికి 10 వేల మంది విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ విద్యతో సాధికారత కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. 2026-27 నాటికి ఒక లక్ష మంది విద్యార్థులపై ప్రభావం చూపనుందని అంచనా వేయబడింది.

## రూ.4 కోట్లతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు



**వత్సవాయి ఫిబ్రవరి 10 మేజర్ న్యూస్ :**మండలంలో భీమవరం గ్రామంలో రూ.4 కోట్లతో బోనకల్లు - భీమవరం, లింగగూడెం - భీమవరం రోడ్లు, ఎస్సీ, బీసీ కాలనీలలో డ్రెయిన్స్ ప్రారంభ కార్యక్రమాలలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని ఎక్కడా రాజీ పడకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీయం వై యస్ జగన్మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ళ సంక్షేమ పాలనలో భీమవరం గ్రామానికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా దాదాపు వంద కోట్ల మేర లబ్ది చేకూర్చామని తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం తదితర పనులతో గ్రామాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్నామని చెప్పారు ఈ కార్యక్రమంలో ఎంపిపి కొలుసు రమాదేవి, జడ్పీటీసీ సభ్యులు యేశపోగు దేవమణి, ఏఎంసి చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, ఏఎంసి డైరెక్టర్ గడ్డిపర్తి చిన్ని, ఎంపిటిసిలు కొమెర చెన్నమ్మ, నర్ల సుధాకర్ రెడ్డి, మండల సమైఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు చింతకుంట్ల వెంకటరెడ్డి, గుండం రంగారెడ్డి ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు భరోసా కల్పించేందుకు లోకేష్ శంఖారావం



**గన్నవరం, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల నిరాశ,నిస్పృహల్లో కూరుకుపోయిన రాష్ట్ర ప్రజలలో భరోసా కల్పించేందుకు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం పూరిస్తున్నారని గన్నవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గత ఐదు సంవత్సరాలు కాలంగా రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాల వల్ల రాష్ట్రంలోని నిరుద్యోగులు,అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు నారా లోకేష్ శంఖారావం యాత్ర చేపట్టారని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో మిగిలిపోయిన ప్రాంతాలను కవర్ చేస్తూ నారా లోకేష్ శంఖారావ యాత్ర చేపడుతున్నారని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోకేష్ పర్యటించనున్నట్లు ఆయన వివరించారు. యాత్రల ద్వారా రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయం వివరించడంతోపాటు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు చేయబోయే సంక్షేమ పథకాలను ఆయన వివరిస్తారని చెప్పారు. యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోయిన నారా లోకేష్ ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి వీలు కలుగుతుందన్నారు. మరో 80 రోజుల్లో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడుతుందని ప్రజల కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని యార్లగడ్డ పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపికి పట్టం కట్టేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని వెంకట్రావ్ ధీమా వ్యక్తం చేశారు..

## లోకేశ్ పూరించిన నాధమే శంఖారావం

**మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**నందిగామ, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్:** పట్టణంలోని కాకాని నగర్‌లో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య శనివారం వారి కార్యాలయంలో యువనేత నారా లోకేష్ పూరించిన శంఖారావం పై ఒక ప్రకటనలో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాధమే శంఖారావం అని అన్నారు. లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా శంఖారావం చేపట్టనున్నారు.నిరుద్యోగంతో యువత ఇబ్బందులు పడుతుండగా, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టింది.ఇప్పటికే యువగళం పాదయాత్ర పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో, పట్టణాల్లో నారా లోకేశ్ పర్యటించారు.జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై, అరాచక పాలనపై గొంతెత్తి ప్రజలకు మద్దతుగా నిలిచారు.వైఎస్సార్సీపీ నేతల అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా 220 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు.జగన్ రెడ్డి ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు పాదయాత్ర ద్వారా లోకేష్ భరోసా ఇచ్చారని అన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం పసి పిల్లల ప్రాణాలతో చెలగాటం

**మాజీ మంత్రి కొల్లు రవీంద్ర**



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు వికటించి ఏడు మంది పిల్లలకు అస్వస్థత, సరైన సమయంలో స్పందించి పిల్లలకు డాక్టర్లు ప్రాణం పోశారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతు నాసిరకం మందులు పంపిణీ వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మందులు పంపిణీ చేసిన సాయి ఫార్మసిటికల్ కంపెనీని వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. వైసీపీ ప్రభుత్వ అనుయాయుల కంపెనీ సాయి ఫార్మాదాస్టికంతో పసి పిల్లల ప్రాణాలకి ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. డాక్టర్లకు చేతులెత్తి నమస్కరిస్తున్న సరైన సమయంలో స్పందించడం వల్ల పిల్లల ప్రాణాలను కాపాడగలిగారన్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ళ నారాయణ మాట్లాడుతు ఇంజక్షన్ వికటించి 7గురు చిన్నారులకు అస్వస్థత రావడం ప్రభుత్వ వైఫల్యం అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి పిల్లల మొత్తం 15 మంది పసిపిల్లలు వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వం సరైన మందులు అందించకపోవడంతో ఇంజక్షన్ చేసిన అరగంటకు విపరీతమైన చలి, జ్వరం రావడం బాధాకరం అన్నారు.

# కమిషనర్ జయరాం పనితీరు ప్రశంసనీయం






**నందిగామ, ఫిబ్రవరి 10, మేజర్ న్యూస్:** పట్టణంలోని శ్రీకరం ఫంక్షన్ హాల్ లో శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ కమిషనర్ గా పనిచేసి బదిలీపై వెళ్తున్న డాక్టర్ యస్.జయరాం వీడ్కోలు సభ, నూతన కమిషనర్ గా నియమితులైన కె. హేమమాలిని ఆహ్వాన సన్మాన సభలో శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉద్యోగులంతా కలిసికట్టుగా.. పట్టుదల, నిబద్ధతతో పనిచేస్తే అద్భుత ఫలితాలు వస్తాయి అనడానికి నందిగామ పురపాలక సంఘమే ఉదాహరణ అని చెప్పారు. కొంతమంది దురుద్దేశం పూర్వకంగా అడ్డుపడుతున్నారని.. మంచి పనులను, అభివృద్ధిని ఎలా అడ్డుకోవాలి అని కొంతమంది ఎన్నో రకాలుగా కుట్రలు పన్నుతున్నారని వారందరిని సమాజం గమనిస్తుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి జరుగుతుంది అనడానికి నందిగామ మున్సిపాలిటీయే తాత్కారణమన్నారు. వృత్తి పట్ల బాధ్యతగా, జవాబుదారితనంతో పనిచేసిన ఉత్తమ కమిషనర్ టీం వర్క్ ఇతర ఉద్యోగులకు కూడా ఆదర్శనీయమన్నారు. నూతనంగా వచ్చిన కమిషనర్ కె. హేమమాలిని కూడా అదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ డాక్టర్ జయరాం మాట్లాడుతూ వృత్తి పట్ల విశ్వాసం, నిబద్ధతతో పనిచేసే ప్రతి ఉద్యోగి గుర్తింపు, గౌరవం తప్పక లభిస్తుందన్నారు. పని చేసే ప్రతి చోట కొన్ని అడ్డంకులు ఎదురవుతాయని.. అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళితే మంచి జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీ కమిషనర్ గా తనకు అన్ని విధాలుగా సహకరించిన సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం బదిలీపై వెళ్తున్న కమిషనర్ డాక్టర్ జయరామ్ ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ శాలువాతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎందరో మహిళలు అభివృద్ధి చెందుతున్నారు





**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలు జగనన్న ప్రభుత్వం ఎంతో బాసటగా నిలుస్తుందని, ప్రభుత్వం అందించే సహకారంతో స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకొని ఎందరో మహిళలు అభివృద్ధి చెందుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. శనివారం పెనమలూరు నియోజకవర్గం లోని కంకిపాడు మండలం కోలవెన్ను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కోలవెన్ను, కుందేరు, సెప్పల్లి, గొల్లగూడెం, దావులూరు, చలివేంద్రపాలెం, క్రిస్టియన్ పేట, జగన్నాధపురం, పునాదిపాడు గ్రామాల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలకు నాలుగో విడత ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా మహోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని తొమ్మిది గ్రామాల లబ్ధిదారులకు 380 పొదుపు సంఘాలకు చెందిన 3802 మంది సభ్యులకు 3 కోట్ల 31 లక్షల 83 వేల 123 రూపాయల ఆసరా మెగా నమూనా చెక్కును, మంత్రి జోగి రమేష్ పంపిణీ చేశారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి జోగి రమేష్ ప్రసంగిస్తూ, ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సరే ఇచ్చిన మాటకు కట్టుబడి హామీల అమలు చేసిన ఘనత దేశం మొత్తం మీద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. కరోనా సమయంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నా సరే సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చటానికి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన 2019 ఎన్నికల నాటికి ఉన్న మహిళా సంఘాల డ్వాక్రా రుణాలు అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లిస్తానని హామీ ఇచ్చామని ఇచ్చిన మాట ప్రకారం 2024 లో నాల్గవ విడత నగదు జమ చేసిన గొప్ప నాయకుడు మన ముఖ్యమంత్రి అని అన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అని మహిళకు సహజంగానే కుటుంబం పట్ల బాధ్యత అధికంగా ఉంటుందని అందుకే ప్రతి పథకంలో వారినే జగనన్న భాగస్వాములుగా చేస్తున్నారన్నారు. అమ్మఒడి పథకం కింద పిల్లల చదువు కోసం వారి తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. ఈ కార్యక్రమంలో కోలవెన్ను సర్పంచ్ సురేష్, ఎంపీడీవో అనూష, డిఆర్డిఏ ఏరియా కోఆర్డినేటర్ ఈ రంగారావు, ఏపిఎం ఎస్. సాంబశివరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, డిఆర్డిఏ ఐకెపి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# స్మశానానికి దారి లేక ఇబ్బందులు

**ఆధునిక యుగంలోనూ ప్రజలకు తప్పని కష్టాలు**



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** అనాగరిక కాలాన్ని తలపించేలా గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని దృశ్యాలు నేటికి దర్శనం ఇస్తున్నాయి. ఆ కోవకి చెందిన దృశ్యమే అవనిగడ్డ శివారు వసుమట్ల ఎస్.సి కాలనీ వాసుల అవస్థలు. అవనిగడ్డ పంచాయితీ శివారు వసుమట్ల ఎస్.సి కాలనీ వాసులకు వారి స్మశాన వాటికకు దారి లేకపోవడంతో శవపేటికను స్మశానానికి తీసుకువెళ్ళాలంటే శవబంధువులు కష్టాలు మాటలతో చెప్పలేం. 20 అడుగుల ఎత్తు గల కరకట్టపై నుండి నిలువుగా శవాన్ని క్రిందకి మోసుకువెళ్ళడం అంటే మాటలతో చెప్పడం కష్టం. గ్రామంలో మనిషి చనిపోతే శవాన్ని ఖననం చేసేందుకు గ్రామస్తులు పడే అవస్థలు అన్ని ఇన్నీ కావు. శుక్రవారం రాత్రి ఆరిగ సువర్ణరావు(59) మరణించడంతో అతని అంతిమ యాత్ర క్రమంలో ఈ దృశ్యాలు మరో మారు వెలుగులోనికి వచ్చాయి. ఇటువంటి సంఘటనలు నేటికి ఉన్నాయంటే నేటి పాలకుల పాలనకు నిదర్శం అని చెప్పక తప్పదు. గ్రామంలోని స్మశానానికి వెళ్ళే దారి ఆక్రమణకు గురైందని ప్రజాప్రతినిధులకు తెలిసినా ఆక్రమణ తొలగించకపోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు గోడు వెల్లబుచ్చుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నేతలు హామీ ఇచ్చారని వారికి హామీ అనంతరం ఆ దారి మరింత ఆక్రమణకు గురైందని, నేటి ప్రభుత్వం దళిత వాడలకు సంబంధించిన స్మశాన వాటికల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేకంగా ఒక పథకాన్ని తీసుకువచ్చారని, ఐనా నేటికి ఈ పరిస్థితిలో కొనసాగుతున్నాయంటే వారి పరిపాలన ఏ విధంగా ఉందో అర్థం అవుతుందని పలువురు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసుమట్ల కాలనీ వాసుల స్మశాన వాటిక రహదారి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ, ఈ సమస్య మరికొద్ది రోజుల్లో పరిష్కరించుకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి అధికారులపై చర్యలకు కార్యచరణకు సిద్ధం అవుతామని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి పరిష్కరిస్తారో లేదో వేచి చూడాలి మరి...?

# బిసిలు టీడీపీకి బలం...బిసి రక్షణ కోసం చట్టం



తుళ్లూరు మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీకి బీసీలు బలమని బీసీలు రక్షణ కోసం టిడిపి జాతీయ నాయకుడు చట్టం చేస్తానని హామీ ఇచ్చిన ట్లు బీసీ నాయకుడు గుమ్మా రాజు(స్వామి) పేర్కొన్నారు శనివారం తుళ్ళూరులో తాడికొండ మంగళగిరి నియోజకవర్గ లకు చెందిన నేతల తో ఒక సమావేశం ఏర్పాటు చేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీల కోసం రక్షణ చట్టం తీసుకువస్తాను అని చెప్పిన తెలుగు దేశం పార్టీకి యువ నాయకుడు శ్నారా లోకేష్ కు సభ అభినందనలు తెలిపారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మొదట నుంచి బీసీలు తెలుగు దేశం పార్టీ కి "బ్యాక్ బోన్" గా ఉంటూ వస్తున్నాం. టీడీపీ అధ్యక్షులు బడుగు బల హీన వర్గాలు మేలు కోరి , వారి అభ్యున్నతి కోసం మాకు రాజధాని ఇచ్చారు. మేము అందరూ సంతోషంగా ఆహ్వానించి సహకరించాము. కానీ కొంత మంది స్థానిక నాయకులు, వాళ్లకి కొన్ని శక్తులు తోడుచేరి బీసీలను ఆర్థికంగా , భౌతికంగా ఇబ్బందులు పెట్టా రు. ముఖ్యంగా తాడికొండ నియోజకవర్గం లో ప్రతేకమయిన పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు పాలక ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల జీవితాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అయ్యాయి. అని దానికి ఎంతో చింతిస్తున్నా మన్నారు . మా భాదలు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు ద్వారా చంద్రబాబు లోకేష్ కు జనసేన పార్టీ ప్రముఖ బీసీ నాయకులు శ్రీనివాస్ యాదవ్ ద్వారా పవన్ కళ్యాణ్‌కు మా భాదలు తెలియ చేస్తామన్నారు. రాజధాని లో బీసీలకు చాలాఅ న్యాయం జరుగుతుంది అని పార్టీ అధిష్టానానికి తెలియజేస్తామన్నారు అందరిని కలుపుకుని పోయే నాయకుడిని తాడికొండ నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపిక చేయాలని విన్నవించారు చంద్రబాబు నాయుడు అధికారం లోకి తీసుకొచ్చేందుకు అందరు సమిష్టిగా పనిచేయాలని కోరారుఈ కార్యక్రమంలో తాటిబోయిన శ్రీనివాసరావు అంగిరేకుల నరేంద్ర మాడపాటి వెంకటేష్ గుమ్మ శివయ్య కూరకుల తేజ బి చవడ కోటేశ్వరరావు మర్రి కిషోర్ ముప్వా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలి

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : గుంటూరు తూర్పు నియోజకవర్గం లోని శారదా కాలనీలో పలు ప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీరు త్రాగడం వల్ల 30 మంది అనారోగ్య బారిన పడ్డారని గుంటూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వానా శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో సరైన పద్ధతిలో తాగునీటిని అందించకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆమె విమర్శించారు. కలుషిత నీరు తాగటం వల్ల ఒకరు మృతి చెందటం గుంటూరు నగరపాలక సంస్థ నిర్లక్ష్య ధోరణిని తెలియజేస్తుం దని ఆమె అధికారుల తీరును విమర్శించారు. కలుషిత మీరు తాగి అస్వస్థతకు గురైన వారు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారనీ, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె డిమాండ్ గుంటూరు నగరంలోనీ పలు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజానీకానికి కనీసం మంచినీటి అవసరాలు



కూడా తీర్చలేని దుస్థితిలో కార్పొరేషన్ పాలకవర్గం ఉందని. ఆమె ధ్వజమెత్తారు. స్థానిక శాసనస భ్యులైన మొహమ్మద్ ముస్తఫా పైపులైన్ల దగ్గరకి వెళ్లి మరమ్మత్తులు చేసినట్టు యాక్టింగ్ చేయడమే తప్ప సరైన పరిష్కారం మార్గం చూపలేదని విమర్శించారు. పైపులైన్ల మరమ్మత్తులకు కావాల్సిన నిధులు మంజూరు చేయడంలో విఫలమయ్యార న్నారు. కనీస నిధులు కూడా విడుదల చేయకపో వడం ఎమ్మెల్యే నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ దుస్థితి ఎమ్మెల్యే అసమర్థతకు అద్దం పడుతోందన్నారు. అసమర్థ నాయకుడు మహమ్మద్ ముస్తఫా . తీరు వల్ల గతంలో కూడా ఆనందపేట్లో ఇలాంటి సంఘటన జరిగిందని గుర్తు చేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అధికారుల చేత పని చేయించుకోలేని అసమర్థుడు స్థానిక శాసనస భ్యులు మహమ్మద్ ముస్తఫా గారనీ తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి సంఘటన గుంటూరు నగరంలో జరగటం చాలా దురదృష్టకరమని సం ఘటన బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని షేక్ రిజ్వానా డిమాండ్ లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని తెలుగుదేశం పార్టీ ముట్టడిస్తుందని హెచ్చరించారు. గుంటూరు పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వాన గారు ఆరోపించారు.

# ఉపాధితో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిసిఎల్ ఫ్యాక్టరీ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్



దుగ్గిరాల, మేజర్ న్యూస్ : సిసిఎల్ ఫ్యాక్టరీలోపలు వురికి జీవనోపాధి కల్పించడంతోపాటు సేవా కార్యక్రమాలలో ముందుంటున్న సీసీఎల్ ఫ్యాక్టరీ అధినేత చల్లా. రాజేంద్రప్రసాద్ ఎంతో అభినంద నీయుడని మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి అన్నారు .దుగ్గిరాల రైల్ పేటలో సిసిఎల్ కంపెనీ సి ఎస్ ఆర్ నిధులతో 70 లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టిన కాలినడక వంతెనను శనివారం ప్రారంభించారు. ఈ ప్రారం భోత్సవానికి ముఖ్య అతిథులుగా సిసిఎల్ చైర్మన్ చల్లా రాజేంద్రప్రసాద్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాలి. వంతన నిర్మాణం చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ముఖ్యంగా విద్యార్థులు వంతెన లేకపోవడంతో పలు ఇబ్బందులుకు. గురి అవుతున్నారని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే ఆర్కే అప్పట్లో అధికారులతో మాట్లాడి వంతెన మంజూరు చేయడం జరిగిందన్నారు .గ్రామాల్లో మంచి కార్యక్రమాలు చేసేందుకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. తమ పరిశ్రమలో పలువురుకి జీవనోపాధి కల్పించడం జరుగుతుంద న్నారు. అంద రి సహకారంతో ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ వంతెన నిర్మాణం చేయడంతో దుగ్గిరాల గ్రామ ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. స్థానిక శాసనసభ్యులు రామకృష్ణారెడ్డి సిసిఎల్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ తో మాట్లాడి 2. వంతెనల నిర్మాణానికి మాట్లాడడం జరిగిందన్నారు .70 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన ఈ వంతెన ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు .వైసిపి ఇన్చార్జి గంజి చిరంజీవి మాట్లాడుతూ మంచికలపూడి వద్ద ఉన్న సిసిఎల్ కంపెనీకి మంచి పేరు ఉన్నదని దుగ్గిరాల మండల గ్రామాల్లో ఎన్నో కుటుంబాలకు ఉపాధి కల్పిస్తుంద న్నారు .కంపెనీ ప్రొడక్ట్స్ తో పాటుగా సేవా రంగంలో అనేక మందికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో దోస్త్. అధ్యక్షులు మిక్కిలినేని గాంధీ ,ఇరిగేషన్ డి ఏ ఎన్ కె వి ప్రసాద్ రావు ,ఏఈ వనిత సిసిఎల్ జిఎం బలరాం సిబ్బంది, మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు మహిళలు. పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సిహెచ్ ప్రతాప్ కుమార్

దుగ్గిరాల, మేజర్ న్యూస్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ సిహెచ్ ప్రతాప్ కుమార్ శనివారం పరిశీలించారు .దుగ్గిరాలలో ఉన్న పోలింగ్ బూత్. లను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ త్రాగునీటి వసతి టాయిలెట్ తో పాటు దివ్యాంగులకొరకు ఏర్పాటు చేసిన ర్యాంపులు పోలింగ్ కేంద్రాల ను పరిశీలించారు .మండలంలోని. ఈ మని ,దుగ్గిరాల పెనుమూలి ,తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులను గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు .ప్రశాంత వాతావరణంలో ఎన్నికలును. జరిపించటమే పోలీస్ శాఖ లక్ష్యమని, ప్రజలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎస్ఐ సిహెచ్ ప్రతాప్ కుమార్ కోరారు.



# తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది అన్న ఎన్టీఆర్



గుంటూరు, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ ప్రజల కోసం ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిందని,పార్టీని స్థాపించి కేవలం 9నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొనివచ్చి తెలుగు వారి ఆత్మగౌరవానికి నిలబెట్టింది అన్న ఎన్టీఆర్ అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర కొనియాడారు. శనివారం గుంటూరు 39వ డివిజన్ టిడిపి కార్పొరేటర్ అభ్యర్థి మీరాబి రుస్తుంబాబుల అధ్వర్యంలో గుజ్జనగుండ్ల కరెంట్ ఆఫీస్, పలకలూరు రోడ్డులో ఏర్పాటు చేసిన అన్న నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నానీ) ఆవిష్కరించారు. ఈసందర్భంగా కోవెలమూడి రవీంద్ర (నానీ) మాట్లాడుతూ.... తెలుగుదేశం పార్టీ కొందరు వ్యక్తులు కోసం, కొందరు పదవుల కోసం ఏర్పడిన పార్టీ కాదని వెల్లడించారు, పేదలకు కూడు, గూడు, గుడ్డ నినాదంతో సామాన్య ప్రజల జీవితాలలో పెను మార్పులు తీసుకు వచ్చిందని కోవెలమూడి రవీంద్ర తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర (నానీ) గారి చేతుల మీదుగా %జీఖజ% కాలేజి రోడ్డులో 39,42వ డివిజన్ల క్లస్టర్ ఇంచార్జి కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఓట్ల దొంగలు పడ్డారని, ప్రజలు అనుక్షణం తమ ఓటును పరిరక్షించుకొనే పరిస్థితి నెలకొందని,అందుకోసం మేము నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధముగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ప్రజలు తమ ఓటుకు సంబందించిన సహాయసహకారాలు అందిస్తారని కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగంసెట్టి వీరయ్య. లంకా ఉదయ్, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, రుస్తుంబాబు,మానం శ్రినివాస్, మానం పద్మశ్రీ, ముత్తినేని రాజేష్,సుఖవాసి శ్రీనివాస్ రావు, కసుకుర్తి హనుమంతరావు, నిమ్మలశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలి



దుగ్గిరాల, మేజర్ న్యూస్ : రానున్న ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న నారా లోకేష్. భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు . అందరం కలిసికట్టుగా కృషి చేయాలని మండల సమావేశంలో కోరారు .దుగ్గిరాల జంపాల కాంప్లెక్స్ నందు శనివారం తెలుగుదేశం పార్టీ మండల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న ఎన్నికలు నేపథ్యంలో పార్టీ గెలుపు తదితర అంశాలపై మాట్లాడుతూ నారా లోకేష్ విజయం కోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య పరిశీల.కులు ముమ్మడిసత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షురా లు కేశంనేని శ్రీ అనిత రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు సీనియర్ నాయకులు. వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్ వాసిరెడ్డి శ్రీనివాసరావు నందిపాటి జోగారావు యే ళ్ల జయలక్ష్మి , శ్రీనివాసరావు ,గద్దె వాసు, వల్లూరు నరసింహారావు కాబోతు దేవదాసు ,తోటకూర సీతారామయ్య, పుతుంబాక సాయికృష్ణ, పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, నాయుడు బాబురావు పసుపులేటి రవి. పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పార్టీ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా రాజ్యశ్యామల మహా యజ్ఞం



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: గుంటూరు నగర శివారు ఏటుకూరు జాతీయ రహదారి ప్రక్కన రాజ్యశ్యామల మహా యజ్ఞం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం గోపూజ తో కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, సుప్రభాత సేవ, శ్రీ చక్ర అర్చన, మహా యాగం, లలితా సహస్రనామం, లక్ష కుంకుమార్చన చివరగా మహా పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. హైదరాబాద్ భవ తారిని ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రకాళి పీఠాధిస్వరి సింధు మాత పర్యవేక్షణలో కార్యక్రమాలను జరిపారు. మొత్తం 108 యాగశాలలు ఏర్పాటు చేసి 324 మంది దంపతులతో మహా యజ్ఞం నిర్వహించారు.

## నారా లోకేష్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ



మంగళగిరి మేజర్ న్యూస్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమం ద్వారా మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్ లో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 45వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 80 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మహిళల అభ్యున్నతి కోసం, వారి జీవనోపాధి కోసం కృషి చేస్తున్న నారా లోకేష్ కు కుట్టుమిషన్లు అందుకున్న లబ్ధిదారులు ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆషాబాల మాట్లాడుతూ నియోజకవర్గంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నారా లోకేష్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వెన్నుదన్నుగా స్త్రీ శక్తి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళలు అంతా ఏకమై వచే ఎన్నికలలో నారా లోకేష్ ను అత్యధిక మేజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, మంచికలపూడి వైష్ణవి, ఊట్ల దుర్గా మల్లేశ్వరి, వాసా పద్మ, యలమంచిలి పద్మజ, దామర్ల పద్మజ, మంగళగిరి మోతుకూరి సుజాత, ట్రైనర్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

## రజకుల ఎస్సీ సాధన కై అన్నవరపు నాగమల్లేశ్వరరావు మహా పాదయాత్ర



మంగళగిరి, మేజర్ న్యూస్: రజక సంఘ నాయకులు నేషనల్ ధోబి మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు చేపట్టిన తిరుమల వెంకన్న స్వామి పాదాల నుండి ప్రారంభించి విజయవాడ కనకదుర్గమ్మవారి కొండ వరకు దాదాపు 500 కిలోమీటర్ల పాదయాత్ర శనివారం మంగళగిరి చేరుకుంది. మంగళగిరి నేతన్న సర్కిల్ వద్ద వారిని బీసీ సంక్షేమ సంఘం, స్వర్ణకార సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ వారికి మద్దతు తెలిపారు. వారితో కలిసి మంగళగిరి అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రజకుల సమస్యలపై సాగించే పోరాటంలో భాగంగా 18 రాష్ట్రాలలో ఎస్సీలుగా ఉన్న రజకులను మన ఆంధ్ర రాష్ట్రంలో కూడా ఎస్సీల జాబితాలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో ఎస్సీ నాయకులు కట్టె పోగు ఉదయభాస్కర్, కొల్లూరు హనుమంతరావు, కాగితాల స్వాతి గౌడ్, వుడతా శ్రీనివాసరావు, తిరువీధుల కిరణ్, మంద్రు, సత్యనారాయణ, రజక సంఘం నాయకులు కామరాజు గద్దె సోమేశ్వరరావు, చాటపర్తి పోసి బాబు, వేముల మహేష్, పేరూరి సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ మంగళగిరిలో నిరసన ర్యాలీ



మంగళగిరి, మేజర్ న్యూస్ : నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు కల్పించలేని దౌర్భాగ్య స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని, ప్రజాపాలన చేతకాకుంటే సీఎం జగన్ రాజీనామా చేసి వెళ్లిపోవాలని తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ నాయకులు మండిపడ్డారు. “దగా డీఎస్సీ వద్దు... మెగా డీఎస్సీ కావాలి” అని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం మంగళగిరి నియోజకవర్గ తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు జగన్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. మెగా డీఎస్సీ ఇవ్వకపోతే నిన్ను దింపడానికి మేము సిద్ధం అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. అంబేద్కర్ కూడలి వద్ద రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టి మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పేరుతో జగన్ మాట నిపబెట్టుకోలేదు కాబట్టి 2024 ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఒడిస్తాం అని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ మెగా డీఎస్సీ అని నాలుగేళ్లుగా ఊరిస్తూ, చివరకు మినీ డీఎస్సీ ప్రకటించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను నయవంచన చేసిందని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు మెగా డీఎస్సీ ఇస్తాం అని చెప్పి ఒక్క టీచర్ ఉద్యోగాన్ని భర్తీ కూడా చేయలేదన్నారు. ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ ,పోలీస్ ఉద్యోగాలు ఇస్తాం అని చెప్పి మోసం చేశారన్నారు.రాష్ట్రంలో సుమారు 15 లక్షల మందికిపైగా నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం 6,100 పోస్టులు మాత్రమే భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. అప్రెంటిస్ విధానాన్ని తీసుకొచ్చి, నిరుద్యోగులను నిలువునా మోసం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 117జీవో పేరుతో మరో 10వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిందని గుర్తు చేశారు. తెలుగు మిడియం తీసివేసి 15వేల ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేసిన ఘనత జగన్మోహనరెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. మే నెల నాటికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5వేల మంది టీచర్లు ఉద్యోగ విరమణ చేయనున్నారని, ఆ స్థానాలను కలుపుకుని మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో జగన్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రావిపాటి సాయికృష్ణ, పడవల మహేష్, భోగి వినోద్ జిల్లా, నియోజకవర్గ, మండల తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ జేఏసీ నాయకులు, టీడీపీ శ్రేణులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సుచరిత కాన్వాయ్ అడ్డగింపు మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన సమయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కాన్వాయ్ అటువైపు గా వచ్చింది. జనం గుమ్మిగూడటంతో డ్రైవర్ సైరన్ వేయటంతో ఒక్కసారిగా తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ జేఏసీ నాయకులు అమె కారును చూట్టుముట్టారు. పోలీసులు నిరసనకారులను తప్పించి కారును ముందుకు వెళ్లేందుకు యత్నించారు. ఈ సందర్భంగా కారు డ్రైవర్ ఒక్క సారిగా కారును పక్కకు తిప్పటంతో పక్కనే ఉన్న ఓ ఎఏస్ఐ క్రింద పడిపోయాడు. పక్కనే ఉన్న పట్టణ ఎస్ఐ మహేంద్ర అతనిని పక్కకు తప్పించారు. కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. డౌన్ డౌన్ సిఎం అంటూ నినాదాలు చేశారు. ఏటాకేలాకు పోలీసులు నిరసనకారులను అడ్డుకుని కాన్వాయ్ ను ముందుకు పంపించివేశారు.

## లాలుపురంలో మూడు దుకాణాల్లో చోరీలు



గుంటూరు క్రైమ్, మేజర్ న్యూస్: గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి వరుస చోరీలు జరిగాయి. ఎన్నడూ లేని విధంగా అగంతకులు పెట్రేగిపోయారు. వరుసగా మూడు కిరాణా దుకాణాల షట్టర్ల తాళాలు పగలగొట్టారు. అనంతరం దుకాణంలో దాచిన నగదు, విలువైన వస్తువులు అపహరించుకుపోయారు. గ్రామం ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల్లో ఇలా చోరీలు జరగటం గమనార్హం. పైగా ప్రతి దుకాణం ఎదుట వీధిలైటు ఉన్నా అగంతకులు ధైర్యంగా తమ పనులు తాము చక్కబెట్టుకు వెళ్లారు. పోలీసుల నిఘా లేకపోవడం వల్లనే గ్రామంలో ఇలా జరిగిందని ప్రజలు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లపాడు స్టేషన్ సుదూరంగా ఉండటంవల్ల జాతీయ రహదారి... పరిసర గ్రామాల వైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్రోలింగ్ వాహనం ఉన్న వారు జాతీయ రహ దారి పై మాత్రమే గస్తీ తిరుగుతూ కాలం సాగిస్తున్నారు. గతంలో బుడంపాడు బైపాస్, ఏటుకూరు బైపాస్, వై జంక్షన్ కూడలి ప్రాంతాల్లో కూడా దుకాణాల్లో చోరీలు జరిగాయి. ముఖ్యంగా లారీ డ్రైవర్లు రోడ్డు ప్రక్కన నిలిపి నిద్రిస్తున్న సమయంలో యువకులు సెల్ఫోన్లు నగదు చోరీ చేస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాలకు చెందిన డ్రైవర్లు కావడం వల్ల పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఇంటి ముఖం పడుతున్నట్లు వినికిడి. జాతీయ రహదారిపై, సమీప గ్రామాల్లో పోలీస్ నైట్ బీట్లు పెంచాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి ముందు నిలిపిన బుల్లెట్ వాహనం చోరీ జరిగింది. ఎట్టికేళ్లకు పోలీసులు వాహనం ఆచూకీ గుర్తించి బాధితులకి అందజేయడం విశేషం. పనిచేయని సీసీ కెమెరాలు... గతంలో సర్పంచ్ గా కాటూరి శ్రీనివాసరావు ఉన్న సమయంలో ప్రధాన రహదారిపై సీసీ కెమెరాలు అమర్చారు. కాలక్రమేనా అవి మరమ్మతులకు గురై పనిచేయటం మొరాయించాయి. దీనివల్ల గ్రామంలోకి వచ్చిన వ్యక్తులు ఆచూకీ కనిపెట్టటం కష్టతరమవుతుంది. బుల్లెట్ చోరీ కేసులో పోలీసులు ప్రధాన రహదారి ఆర్.బి.ఎల్ బ్యాంకు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించారు. అదేవి ధంగా లాల్పురంలో చోరీకి పాల్పన అగంతకులను గుర్తించి అరెస్ట్ చేయాలని పోలీసులను ప్రజలు కోరుతున్నారు. గ్రామంలోని మూడు కిరాణా దుకాణాల్లో చోరీకి పాల్పడిన నిందితులను గుర్తిస్తామని గుంటూరు సౌత్ డిఎస్పి మహబూబ్ బాషా విలేకరులకు తెలిపారు. అగంతకుల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తానని సూచించారు. గ్రామ పరిధిలో రాత్రి సమయంలో ప్రత్యేక పోలీస్ బీట్ ఏర్పాటు చేస్తామన్నారు.

## టిడిపిలో చేరిన లాలుపురం కొత్త కాలనీ వాసులు



గుంటూరు రూరల్, మేజర్ న్యూస్: ప్రత్తిపాడు నియోజకవర్గం గుంటూరు రూరల్ మండలం లాలుపురం పంచాయతీలోని అల్లూరి సీతారామా రాజు నగర్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయ్యారు. గత ఐదు సంవత్సరాలు వైఎస్ఆర్సిపి అధికారంలో ఉన్నా ఇటువంటి అభివృద్ధి చేయకపోవడంతో అందులోనూ గుంటూరు తెలుగుదేశం పార్టీ ఎంపీ నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. కావున రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే స్థానికంగా అభివృద్ధి జరుగుతుందని నమ్మి తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాస్, రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ గించుపల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల మ్యాని, గుంటూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి లీలామల్లేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గంధం సురేష్, గుంటూరు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బూర్రు లీలా కృష్ణ, ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషు, గుంటూరు జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు అనిల్, లాలుపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు అల్లం సాంబశివరావు, లాలుపురం మాజీ సర్పంచి కాటూరి శ్రీనివాస్, ప్రతిపాడు నియోజకవర్గ ఐటీడీపీ జనరల్ సెక్రెటరీ కల్లూరు అవినాష్, గుంటుపల్లి కుమార్ స్వామి, రూరల్ మండల ఉపాధ్యక్షుడు తెల్ల మేకల రమేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు చెన్నుపాటీ మోహన్ రావు, పార్టీలో జాయిన్ అయినా కార్యకర్తలు నాగులమీర, శ్రీను, వెంకట్, రమణమ్మ, శివ, స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ఆత్మగౌరవం నిలవాలంటే అరాచక ప్రభుత్వం పోవాలి - కొనకల్ల నారాయణ




పెదకాకాని మేజర్ న్యూస్: బీసీల ఆత్మగౌరవం నిలవాలంటే అరాచక ప్రభుత్వం పోయి ప్రజా ప్రభుత్వం కొలువు తీరాల్సిందేనని మాజీ పార్లమెంట్ సభ్యులు టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ళ నారాయణ పేర్కొన్నారు మండల కేంద్రమైన పెదకాకానిలో శనివారం తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో పొన్నూరు నియోజకవర్గ జయహో బిసి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముద్రబోయిన సూరిబాబు అధ్యక్షత వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు రాక్షస పాలన కింద నలిగిపోతున్నారని వారికి విముక్తి కలగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు ముఖ్యంగా బీసీ సామాజిక వర్గం వైసీపీ ప్రభుత్వంలో దాడులకు గురై పూర్తిగా నిర్వీర్యమైందని అన్నారు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు ఆనాడు బీసీలకు రిజర్వేషన్లు కల్పించి గుర్తింపుని ఇచ్చారని తర్వాత నారా చంద్రబాబు నాయుడు బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వాములను చేయాలని బీసీలకు పెద్దపీట వేయడం జరిగిందని అన్నారు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు దువ్వారపు రామారావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం వైసీపీ ప్రభుత్వం హరించి వేస్తుందని నామమాత్రంగా బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటిని ఉత్సవ విగ్రహాలుగా వదిలేసిందని అన్నారు బీసీలకు న్యాయం జరగాలంటే తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావాలని దానికి ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని అన్నారు పొన్నూరు మాజీ శాసనసభ్యులు సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు బంగారు బాట వేయాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు బీసీలకు సముచిత గౌరవాన్ని ఇచ్చి వారిని గౌరవించుకున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని బీసీలే తెలుగుదేశం పార్టీకి వెన్నుముకలని అన్నారు రాబోయే ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చూపించి తెలుగుదేశం పార్టీ అధికారం సాధించడంలో భాగస్వాములు కావాలని రాష్ట్రంలో కొలువ తీరబోయే తెలుగుదేశం జనసేన ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు జనసేన రాష్ట్ర నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపి ప్రజలకు విముక్తి కల్పించడానికి జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కంకణం కట్టుకున్నారని అందులో భాగంగానే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుని ముందుకు వెళుతున్నట్లు తెలిపారు పొత్తుల భాగంగా నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు బరిలో ఉన్న జనసేన పార్టీ అభ్యర్థులు బరిలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు జనసేన సైనికులు సమిష్టిగా కృషిచేసి వారి గెలుపుకు కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు తెలుగుదేశం పార్టీ నాయకులు తాళ్ళ వెంకటేశ్ యాదవ్ రాష్ట్ర సగర సాధికార కన్వీనర్ జంపని శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గుంటుపల్లి నాగేశ్వరావు పొన్నూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు దివి శివరాం తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# 14 నుంచి పవన్ కళ్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల పర్యటన

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఉభయ గోదావరి జిల్లాల పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ పర్యటన సాగుతుంది. తొలి రోజు భీమవరంలో వివిధ సమావేశాలలో పాల్గొంటారు. తదుపరి అమలాపురం, కాకినాడ, రాజమండ్రిలలో సమావేశాలు ఉంటాయి. ఈ పర్యటనలలో భాగంగా పార్టీ ముఖ్య నాయకులు, స్థానికంగా ప్రభావశీలురు, ముఖ్యులతో భేటీ అవుతారు. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశమవుతారు. నియోజకవర్గాల స్థాయిలో ఇరు పార్టీల నాయకులు, శ్రేణుల మధ్య సుహృద్భావ వాతావరణం



ఏర్పాటు, పొత్తు ఫలితాల ఫలాల లక్ష్యంగా భేటీలు జరుగుతాయి. పవన్ కళ్యాణ్ పర్యటనలు మూడు దశలుగా నిర్వహించాలని నిర్ణయించారు. తొలి దశలో ముఖ్య నాయకులు, ప్రభావశీలురు, ముఖ్యులతో సమావేశాలు ఉంటాయి. రెండో సారి పర్యటనలో పార్టీ స్థానిక కమిటీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమావేశాలలో పాల్గొంటారు. మూడో దశలో ఎన్నికల ప్రచారం చేపడతారు. ఎన్నికల ప్రచారం చేపట్టేనాటికి పవన్ కళ్యాణ్ మూడు సార్లు ఆయా ప్రాంతాలకు వెళ్ళే విధంగా పర్యటనల షెడ్యూల్ సిద్ధమవుతోంది. ఉభయ గోదావరి జిల్లాల పర్యటన అనంతరం ఇతర ప్రాంతాలకు సంబంధించిన పర్యటనలను ఖరారు చేసేందుకు పార్టీ ప్రచార కమిటీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.

# దేశంలోనే అతి పెద్ద ఫెయిల్యూర్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : తన అసమర్థ , అవగాహనా రాహిత్య , అరాచక పాలనతో దేశంలోనే అతిపెద్ద ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి విమర్శించారు.ప్రజలు ఎంతో నమ్మకంతో రికార్డు స్థాయి మెజారిటీ ఇచ్చినా పరిపాలన చేతకాక చేతులెత్తేసిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రాజకీయాల్లోనే ఒక చరిత్ర హీనుడిగా మిగిలిపోయాడంటూ ఆయన ఎద్దేవా చేశారు. 22 వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో రూపొందించిన పాలనంతా అరాచకం - అడుగుదూరంలో పరాజయం పోస్టర్లను శుక్రవారం స్థానిక శ్రీనివాసరావుతోటలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ వైసిపి పాలనపై క్షేత్రస్థాయిలో ఊహించని ప్రజా వ్యతిరేకత నెలకొందన్నారు. దీంతో ముఖ్యమంత్రి నుంచి కార్యకర్త వరకు నిర్వేదంలో మునిగిపోయారన్నారు. ఓటమి తప్పదన్న వాస్తవాన్ని వైసీపీ నేతలు గ్రహించారన్నారు. మనసావాచా నమ్మి వెన్నంటి నడిచిన దళిత , ముస్లిం మైనారిటీ , బీసీ , కాపు వర్గాల జీవితాలను వైసీపీ చిన్నాభిన్నం చేసిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి నమ్మకద్రోహాన్ని ఆయా వర్గాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 175 కి 175 అంటూ ఒకప్పుడు బీరాలు పోయిన వైసీపీ నేతలు ఇప్పుడు పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకని దీన , హీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యకర్తల్లో కోల్పోయిన ధైర్యాన్ని నింపేందుకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తూ సిద్ధం అంటూ రాష్ట్ర వ్యాప్తంగా బ్యానర్లు కట్టడం సిగ్గుచేటన్నారు. ఎంతగా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా ముఖ్యమంత్రి మొహంలో ఓటమి ఛాయలు ప్రస్ఫుటంగా కనపడుతున్నాయన్నారు. ప్రజలు వైసీపీని రాష్ట్రం నుంచి తరిమేసేందుకు సంసిద్ధులై ఉన్నారన్నారు. ఉద్యోగులు , ఉపాధ్యాయులు , నిరుద్యోగులు , వ్యాపారులు , రోజువారీ కూలీలు ఇలా ప్రతీ ఒక్కరినీ , అన్ని వర్గాలను ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దగా చేసారని దుయ్యబట్టారు. తమ నియంతృత్వ పోకడలను ప్రశ్నిస్తే సామాన్యుల దగ్గర నుంచి ఉన్నతస్థాయి వ్యక్తుల వరకు వ్యవస్థల్ని అడ్డుపెట్టుకొని మానసిక , భౌతిక దాడులకు సైతం వైసీపీ నాయకులు పాల్పడటంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మరోవైపు గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలైన సీపీయస్ రద్దు, పోలవరం నిర్మాణం ,మద్యపాననిషేధం, జాబ్ క్యాలెండర్ వంటి వాటిని వైసీపీ నెరవేర్చకపోవటాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. వైసీపీకి ఓటు వేసేందుకు ప్రజలు ఇష్టపడటం లేదన్నారు రానున్న ఎన్నికల్లో ప్రజల చేతుల్లో ఎదురయ్యే ఘోర పరాజయం నుంచి వైసీపీని ఏ శక్తి రక్షించలేదని ఆళ్ళ హరి అన్నారు. కార్యక్రమంలో రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్ , టీడీపీ డివిజన్ అధ్యక్షుడు షేక్ నాగూర్ , జనసేన డివిజన్ అధ్యక్షులు కొలసాని బాలకృష్ణ , గడ్డం రోశయ్య , నండూరి స్వామి , కోలా అంజి , బాలకృష్ణ , వడ్డె సుబ్బారావు , కోలా మల్లికార్జున , బాలు , ఉప్పుతల రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాటకోత్సవాలు ప్రారంభం



మేజర్ న్యూస్ : స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె. ఈవెంట్స్ నిర్వహణలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి 11 వసంతాల కళారంగ ప్రస్థానం సందర్భంగా 12వ నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భాగంగా తొలిరోజు రంగస్థల నటుడు, దర్శకుడు కావూరి సత్యనారాయణ అధ్యక్షత జరిగిన సభలో అతిథులుగా విద్యావేత్త పాతూరి కోటేశ్వరరావు, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, లేబర్ బోర్డు ఛైర్మన్ వల్లూరి జయప్రకాశ్ నారాయణ, పోలిమెట్ల ఛారిటబుల్ ట్రస్ట్ పోలిమెట్ల గోపిచంద్, డాక్టర్ కాసరనేని శ్రీవల్లిరాణి, డాక్టర్ పాతూరి ఉషాబాల, ఆలయ కమిటి సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, రామకృష్ణప్రసాద్ కాట్రగడ్డ తదితరులు పాల్గొని డాక్టర్ సదాశివరావు వైద్యరంగానికి చేసిన సేవలను కొనియాడారు. సంస్థ కన్వీనర్ ముప్పా అంకమ్మరావును ఘనంగా సత్కరించారు. సభానంతరం సిరిమువ్వ కల్చరల్ అసోషియేషన్, హైదరాబాద్ వారు అదారి సోమశేఖర్ రచనకు మంజునాథ్ దర్శకత్వం వహించిన హక్కు నాటికను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇందులో మంజునాథ్, శ్రీదేవి, సతీష్, మాధవి, శివరావు, వేణుగోపాలు నటించారు. నాగరాజు సంగీత సహకారాన్ని అందించారు.

# నేడు నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ లీగ్- 3 పోటీలు ప్రారంభం



మంగళగిరి, మేజర్ న్యూస్: మంగళగిరి నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో రేపటి నుంచి మంగళగిరి వాలీబాల్ లీగ్-3 పేరుతో నిర్వహించే వాలీబాల్ పోటీల్లో 58 జట్లు పాల్గొనున్నాయి. వీటికి సంబంధించి ఎంఎస్ఎస్ భవన్ లో మధ్యాహ్నం డ్రా తీశారు. పేర్లు నమోదు చేసుకున్న 58 జట్ల కెప్టెన్‌ల సమక్షంలో టీడీపీ నాయకులు డ్రా తీశారు. పోటీపడనున్న అన్ని జట్లు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి జావ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ నారా లోకేష్ సహకారంతో రేపటి నుండి 18 వ తేదీ వరకు మంగళగిరి పట్టణ బైపాస్ వెంబడి, కొండపనేని టౌన్ షిప్, బోగి ఎస్టేట్ లో ఉన్న నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో మంగళగిరి వాలీబాల్ లీగ్ 3 (MVL - 3) పేరుతో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలో విజేతలకు నారా లోకేష్ స్ఫూర్తి తో ప్రథమ బహుమతి కింద లక్ష రూపాయలను మంచికలపూడి వైష్ణవి, మాలెపాటి పుల్లయ్య చౌదరి , ద్వితీయ బహుమతి కింద 50 వేలను బొర్రా సాయి అరవింద్,తృతీయ బహుమతి కింద 25 వేలు నగదును ఇట్టా పెంచలయ్య లు బహుకరించనున్నారని జవ్వాది కిరణ్ చంద్ వివరించారు. మంగళగిరి నియోజకవర్గ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా నారా లోకేష్ సొంత నిధులతో మంగళగిరి, తాడేపల్లిలో నారా లోకేష్ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో మంగళగిరి ప్రీమియర్ లీగ్ 1,2 పేరుతో క్రికెట్ పోటీలను, మంగళగిరి వాలీబాల్ లీగ్1,2ల పేరిట వాలీబాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా టోర్నమెంట్లను నారా లోకేష్ సహకారంతో నిర్వహించడం జరుగుతుందని కిరణ్ చంద్ తెలిపారు . ఈ కార్యక్రమంలో కేసంనేని శ్రీ అనిత, వింజమూరి ఆశాబాల, పడవల మహేష్, పినపాటి జీవన్, దర్శి హరికృష్ణ, మంచికలపూడి వైష్ణవి, కొప్పుల మధుబాబు,కొదమల సురేష్, భోగి వినోద్, ఈపూరి జయకృష్ణ, జి నాగేశ్వరరావు,దేవరపల్లి మహేష్, రెంటపల్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చల శ్యామ్ బాబుకు పితృవియోగం



మంగళగిరి, మేజర్ న్యూస్ : మంగళగిరి వైకాపా నాయకులు పచ్చల శ్యామ్ బాబు తండ్రి పచ్చల నాగేశ్వరరావు (70) శనివారం మృతి చెందారు. నవులూరు మక్కెవారిపేటలోని అయన నివాసంలో నాగేశ్వరరావు మృతదేహానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి వైకాపా నియోజకవర్గ ఇంచార్జ్ గంజి చిరంజీవి, ఎంటిఎంసి వైకాపా అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి పూలమాలు వేసి నివాళ్ళుర్పించారు. శ్యామ్ బాబు కుటుంబానికి తమ ప్రగాఢ సానూభూతిని తెలియచేశారు. సంతాపం తెలిపిన వారిలో వైకాపా నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆకురాతి రాజేష్, కట్టెపోగు ఉదయ్ బాస్కర్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, టిడిపి నాయకులు మునగపాటి వెంకటేశ్వర రావు, షేక్ హాస్నన్ తదితరులు ఉన్నారు.

## పొత్తులపై జనసేన కార్యకర్తలకు పవన్ కీలక సూచనలు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : జన హితం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికే జనసేన ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకొని పొత్తుల దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రస్తుతం పొత్తులకు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయనీ.. ఈ దశలో పార్టీ నాయకులు భావోద్వేగాలతో ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు. జనసేన విధానాలకు భిన్నమైన అభిప్రాయాలూ ప్రచారం చేయవద్దని కోరారు. ఇటువంటి ప్రకటనలతో రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించినవారు అవుతారని స్పష్టం చేశారు. అభిప్రాయాలు, సందేహాలు ఏమైనా ఉంటే జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తద్వారా కార్యకర్తల ఆలోచనలు పార్టీకి చేరుతాయన్నారు. అలాగే పొత్తులపై భిన్నంగా ప్రకటనలు చేసే వారి నుంచి వివరణ తీసుకోవాలని పార్టీ నాయకులను ఆదేశిం చానన్నారు.

## పాత పెన్షన్ స్కీమ్ కావాలి




గుంటూరు:, మేజర్ న్యూస్ : జి.పి.యస్ ను కాకుండా గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రధాన హామీ అయిన పాత పెన్షన్ విధానం అమలు చేయాలని స్థానిక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయం నందు జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా శనివారం కోరారు. సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అధికారం వచ్చాక ప్రభుత్వం విస్మరించిందని ఇప్పటికైనా పునరాలోచన చేయాలని, ఉద్యోగి పదవీవిరమణ తరువాత, పాత పెన్షన్ ఉద్యోగికి 100 రూ. లబ్ది చేకూరితే, సిపిఎస్ ఉద్యోగికి 25 రూ మాత్రమే లబ్ది చేకూరుతుందని టక్కర్ కమిటీ రిపోర్ట్ లో తేల్చారు. పాత పెన్షన్ ఉద్యోగికి, సి.పి.ఎస్ ఉద్యోగికి తేడా 75%. ఉందన్నారు పాత పెన్షన్ లాభాలు వివరించారు ప్రభుత్వంతో జీవితాంతం సంబంధం ఉంటుంది. సంవత్సరానికి రెండు డిఏలులు, ఐదేళ్లకు ఒకసారి పి ఎస్ సి తో పెన్షన్ పెంపు సౌలభ్యం. ఉంటుందన్నారు పదవీ విరమణ తరువాత కూడా హెల్త్ కార్డులు వర్తిస్తాయి. , ఉద్యోగులు పెన్షన్ నిర్వహణ చార్జీలు చెల్లించనక్కరలేదు,. పెన్షన్ కొరకు ఉద్యోగి ప్రతినెలా చందా చెల్లించనవసరం లేదు. పదవీ విరమణ తరువాత ఉద్యోగి మరణించిన, వారి కుటుంబానికి ప్రభుత్వం తోడుగా ఉంటుంది. జీవితాంతం పెన్షన్ సౌకర్యం., కమ్యుటేషన్ సౌలభ్యం. గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ ఉంటుంది.,ఫ్యామిలీ పెన్షన్ కొరకు ఉద్యోగి ఒక్క రూపాయి చెల్లించనవసరం లేదు.. క్వాంటం ఆఫ్ పెన్షన్, అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ సౌకర్యం కలదు.. పిఎఫ్ లోన్ సౌకర్యం ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చాంద్ బాష జిల్లా ఉపాధ్యక్షులు హుస్సేన్ ఖాన్ సంయుక్త కార్యదర్శి జి.శ్రీనివాసరావు నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వర రావు నగర శాఖ సంయుక్త కార్యదర్శి నాగభూషణం,, జాను తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో తాగునీటి సరఫరా పై ఆందోళన చెందొద్దు - శివ నాగ మనోహర్ నాయుడు



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : గుంటూరు నగర ప్రజలు త్రాగునీటి సరఫరాపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిఎంసి శుద్ధమైన త్రాగునీటిని అందించడంలో నిర్దేశిత నిబందనల మేరకు అన్ని చర్యలు పక్కాగా తీసుకుంటుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం ఉదయం శారదా కాలనీ, శ్రీనగర్ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని తెలిసిన వెంటనే నగర మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ త్రాగునీటి కాలుష్యం విషయం తెలి యగానే శారదకాలని సదరు ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు వచ్చిన కుటుంబాల ను పరామర్శించి, వారితో అనారోగ్యకార ణాలను అడిగి తెలుసు కోవడం జరిగింద న్నారు. శారదకాలని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో, ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న 19 మంది బాదితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూపరిం డెంట్‌ను ఆదేశించడం జరిగిందన్నారు. ఇప్పటికే 3 రోజుల క్రితం సంగడిగుంట తిరుమలచారి కాలనిలో జరిగిన సంఘటన పై తక్షణం స్పందించి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పరిసర ప్రాంతాల్లో డోర్ టు డోర్ త్రాగునీటి నమూనా పరీక్షలు, క్లోరిన్ పరీక్షలు ప్రభుత్వ మెడికల్ కాలే జిలోని రీజినల్ ల్యాబ్ వారిచే పరీక్షించడమైనది. త్రాగునీటిలో క్లోరిన్ కూడా తగు పాలల్లో ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రజారోగ్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి ఆరోగ్య సర్వే చేయడం జరిగిందని, అందులో ఎవ్వరికీ డయేరియా ప్రభావం లేదని రిపోర్ట్ వచ్చింది. శనివారం మృతి చెందిన శారదాకాలనికి చెందిన పద్మ (18ఏళ్ళు) ప్రాధమిక విచారణలో డయేరియా వలన మృతి చెందలేదని తెలిసిందని, పోస్ట్ మార్టం కూడా చేపట్టాలని ఆదేశించామన్నారు. శారదాకా లని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ చేయడం జరిగిందని, ఎవరికైనా అనారోగ్య లక్షణాలు ఉంటే వెంటనే మెడికల్ క్యాంప్ లో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. బాదితులకు మెరుగైన వైద్యం అందేలా జిజిహెచ్ లో నగరపాలక సంస్థ సిఎంఓహెచ్ డాక్టర్ ఆషా, శారదా కాలనిలో క్షేత్ర స్థాయిలో మెడికల్ సర్వే, వైద్య పరీక్షలు పర్యవేక్షణ చేయాలని ఎంహెచ్ఓని ఆదేశించామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని ప్రతి రిజర్వాయర్ పరిధిలో త్రాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శుల ద్వారా ఫస్ట్ పాయింట్ నుండి టేయిలేండ్ వరకు క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని ఆదేశించామని తెలిపారు. శారదా కాలనీ రిజర్వాయర్ షెడ్యుల్ మేరకు జనవరి 20 న క్లీన్ చేయడం జరిగిందని, నగరంలోని అన్ని రిజర్వాయర్లు కూడా నిర్దేశిత గడువు మేరకు క్లీన్ చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా అధికారుల నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మానసిక వికలాంగులకు అండగా నిలుస్తున్న మానవత




గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య. బ్యూరో : గత దశాబ్ద కాలంగా గుంటూరు నగరంలోని గోరంట్ల వద్ద గల కార్మెల్ సేవా సదన్, మానసిక వికలాంగుల ఆశ్రమం నందు దాదాపు 70 మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించిన కార్మల్ సేవాసదన్ సంస్థను ఆదుకోవడానికి మానవత స్వచ్ఛంద సంస్థ శ్రీకారం చుట్టింది. ఈనెల 10వ తేదీన కార్మెల్ సేవా సదన్‌కు ప్రహరీ గోడ నిర్మాణానికై భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ ప్రహరీ గోడ నిర్మాణానికి ముందుకు వచ్చిన శర్వాణి రెడీ మిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డిని అభినందించారు. కీర్తన సంస్థ అధినేత పద్మజా రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందించడం శుభ పరిణామం అన్నారు. గుంటూరు నగరంలో దాతల సహకారంతో ప్రభుత్వ హాస్టల్లలో వసతులు, సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు డాక్టర్ జాక్ క్లామకస్ ప్రసంగిస్తూ సమాజంలో విసిరి వేయబడిన, తిరస్కరించిన అభాగ్యులను చేరదీసి సేవలందించడమే కార్మెల్ సేవా సదన్ ప్రథమ లక్ష్యమని అన్నారు. 70 మంది మానసిక వికలాంగులు స్వేచ్ఛ వాయువులు పీల్చడానికి దోహదపడే కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ముందుకు వచ్చిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థను అభినందించారు. డీఎస్పీ డాక్టర్ గోలి లక్ష్మయ్య ప్రసంగిస్తూ మానవత్వం మూర్తీ భవించిన మహానీయులందరూ ఒకే వేదికకు చేరి సేవా కార్యక్రమాలను నిర్వహిం చడం సమాజానికి శ్రేయస్కరమన్నారు. రీజనల్ జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ బి శ్రీ కృష్ణవేణి ప్రసంగిస్తూ 22 రకాల అంగవైకల్యాలతో బాధపడుతున్న వాళ్లకు మెరుగైన జీవితాన్ని అందించగలగటం హర్షనీయమన్నారు. మానవత చైర్మన్ పావులూరు రమేష్ ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఉన్న సేవా తత్పరులు, సంస్థలను ఒకే త్రాటిపైకి తెచ్చి, పరస్పర సమన్వయ సహకారాలతో సేవా కార్యక్రమాల పరిధిని విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రుద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మహబూబ్ సుభాని, కోవిడ్ ఫైటర్స్ అధినేతలు అల్లాబక్షు, ముజీబ్, మానవత ప్రెసిడెంట్ పి.విమల కుమారి, కార్యదర్శి వర్రె సుబ్రహ్మణ్యం , కన్వీనర్ వి. వి. నాగిరెడ్డి, కో ఆర్డినేటర్స్ ఏనుగుల రమణబాబు, సిహెచ్ రామబ్రహ్మం తదితరులు ప్రసంగించారు.

## జిజే హెచ్ లో బాధితులను పరామర్శించిన జిల్లా కలెక్టర్







గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు నగరంలో వాంతులు , విరోచనలతో అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్ లో చికిత్స పొందుతున్న పేషెంట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి శనివారం రాత్రి బాధితులను పరామర్శించారు. నగర మేయర్ కావటి శివనాగు మనోహర్ నాయుడుని, కమిషనర్ కీర్తి చేకూరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని గుంటూరు ప్రభుత్వ వైద్యశాల అధికారులను ఆదేశించారు.